




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక




**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 249 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 30-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00

## ఉన్నావో రేప్ కేసులో నిందితుడికి నో బెయిల్

- హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీం స్టే
- 'ప్రజా సేవకుడు' అనే పదానికి హైకోర్టు ఇచ్చిన వివరణ తప్పు
- హర్షం వ్యక్తం చేసిన బాధితురాలు
- న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందంటూ వెల్లడి

న్యూఢిల్లీ

ఉన్నావో రేప్ కేసులో బిజెపి మాజీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన బెయిల్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. 2017లో ఉత్తరప్రదేశ్లోని ఉన్నావోలో నాటి బిజెపి ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్ అత్యాచార ఘటన సంచలనమయింది. ఆయనకు జీవిత ఖైది శిక్షను న్యాయస్థానం విధించింది. అయితే సెంగార్‌కు విధించిన జీవిత ఖైదు శిక్షను రద్దు చేస్తూ ఢిల్లీ కోర్టు గతవారం ఆదేశాలు ఇచ్చింది. ఈ తీర్పుపై విమర్శ లు వెల్లువెత్తాయి. అటు బాధితురాలు, ఆమె కుటుం బ సభ్యులు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. మరోవైపు ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్పకర్, సిబిఐ వేర్వేరుగా సుప్రీంకోర్టు లో పిటిషన్లు దాఖలు చేశాయి. సోమవారం ఈ పిటిషన్లను సిజెఐ జస్టిస్ సూర్య కాంత్,

-మిగతా 2 లో

# అసెంబ్లీలో.. ఆప్యాయత

## కేసీఆర్‌కు నమస్కరించి ఆరోగ్యంపై సీఎం వాకబు

- తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం
- హాజరైన సీఎం రేవంత్, విపక్షనేత కేసీఆర్
- కేసీఆర్‌ను కలిసి పలకరించిన మంత్రులు
- కేసీఆర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు
- అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్,-డిసెంబర్ 29 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. మరోవైపు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు ముట్టడిస్తారనే సమాచారంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు.

-మిగతా 2 లో









## సనాతన హిందూ ధర్మపరిరక్షణ

- దారితప్పిన వాళ్లకు అఖండ-2 కనువిప్పు కావాలి
- బోయపాటితో కలసి మూవీని వీక్షించిన బండి సంజయ్

హైదరాబాద్, డిసెంబర్ 29 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ -2 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి 'అఖండ 2 -తాండవం' సినిమాను బండి సంజయ్ సోమవారం వీక్షించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాశ్, అధికార ప్రతినిధి జె.సంగప్ప, జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్‌తో సహా పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు బండి సంజయ్‌తో కలిసి ఈ సినిమాను చూశారు. అనంతరం బోయపాటితో కలిసి బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు.

-మిగతా 2 లో



## పుతిన్ నివాసంపై దాడికి ఉక్రెయిన్ యత్నం!

- రష్యా ఆరోపణ..ఖండించిన ఉక్రెయిన్
- శాంతి ప్రణాళికపై రెఫరెండం

మాస్కో -
రష్యాలో అధ్యక్షుడు పుతిన్ అధికార నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు ప్రయత్నించిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్జీ లావరోవ్ చెప్పారు. నోవ్‌గోరోడ్ ప్రాంతంలో అధ్యక్షుడి నివాసాన్ని టార్గెట్ చేస్తూ ఓ రోజు రాత్రి ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసినట్టు ఆయన ఆరోపించారు. అయితే వీటిని రష్యా విజయవంతంగా అడ్డుకుందని, గగనతల రక్షణ వ్యవస్థ 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను కూల్చేసిందని ఆయన పేర్కొన్నారు. రష్యా ఆరోపణల్ని ఉక్రెయిన్ ఖండి ంచింది. మరిన్ని సైనిక దాడులు చేపట్టేందుకు, శాంతి చర్చల్ని దెబ్బతీసేందుకు రష్యా చేస్తున్న ప్రయత్నంగా ఉక్రెయిన్ తెలిపింది.


-మిగతా 2 లో

## తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు

- త్రివిధ దళాల తరలింపు
- వేర్పాటువాదులు, విదేశీ శక్తులకు హెచ్చరిక
- సైన్యాన్ని అప్రమత్తం చేసిన తైవాన్

హాంగ్‌కాంగ్
: వేర్పాటువాదులకు, తన వ్యవహారాలలో తలదూరుస్తున్న విదేశీ శక్తులకు చైనా గట్టి హెచ్చరికలు జారీ చేస్తోంది. తైవాన్ చుట్టూ సంయుక్త విన్యాసాలు జరిపేందుకు సోమవారం వైమానిక, నౌక, రాకెట్ దళాలను పంపింది. తన ఆంతరంగిక విషయాలలో వేలుపెడుతున్న అమెరికా, జపాన్ దేశాల వైఖరులను చైనా తీవ్రంగా తప్పు పడుతోంది. తైవాన్‌కు అమెరికా

-మిగతా 2 లో



## రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు



- కేంద్రం నుంచి 5.44 లక్షల మెట్రిక్ టన్నుల రాక
- గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నుల అధిక అమ్మకం
- ఐదు జిల్లాల్లో ఫెర్టిలైజర్ యాప్ ప్రయోగం విజయవంతం
- యాప్‌తో 9 రోజుల్లో 2,01,789 బస్తాల కొనుగోలు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల

హైదరాబాద్
రబీ సీజన్‌కు అవసరమైనంత యూరియా నిల్వ రాష్ట్ర ప్రభుత్వ వద్ద అందుబాటులో ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని కోరారు. రైతుల సౌకర్యార్థం వ్యవసాయ కమిషనరేట్ లో టోల్ ఫ్రీ నెం. 18005995779

-మిగతా 2 లో

## ఇక 28 జిల్లాలు

- కొత్తగా మార్కాపురం, పోలవరం
- మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా
- నెల్లూరుకు గూడూరులోని మూడు మండలాలు
- కొత్త వాహనాలకు10శాతం రోడ్డు భద్రత పన్ను
- అప్పు కోసం ప్రీపెయిడ్ మీటర్లకు గ్రీన్ సిగల్
- ఆమోదం తెలిపిన మంత్రివర్గం



అమరావతి బ్యూరో
రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలకు అదనంగా రెండు జిల్లాల ఏర్పాటుకు రాష్ట్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటుచేస్తూ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశ నిర్ణయాలను రెవెన్యూ, పౌరసరఫరాల, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ విలేకరులకు వివరించారు. జిల్లాల పునర్విభజనపై నవంబర్ 17న ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌పై వచ్చిన పలు అభ్యతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకున్నా మని చెప్పారు. రంపచోడవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలవరం గ్రామాన్ని అభివృద్ధి చేసి రెవెన్యూ డివిజన్‌గా భవిష్యత్తులో ఏర్పాటు చేస్తామన్నారు. కనిగిరి, ఎర్రగొండపాలెం, గిద్దలూరును కలిపి మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేస్తామన్నారు. మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఉంటుందని తెలిపారు. రాయచోటి నియోజకవర్గాన్ని

-మిగతా 2 లో

# నీళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ

## చంద్రబాబుకు కోపం వస్తుందనే పాలమూరు ప్రాజెక్టు పక్కకు

- కావాలనే పట్టించుకోని రేవంత్‌రెడ్డి
- డబ్బుల కోసమే జీహెచ్ఎంసీ వార్డుల విభజన
- ఫోన్ ట్యాపింగ్, సిట్ డ్రామాలతో ప్రజల దృష్టిమళ్లించే యత్నం
- అసెంబ్లీలో మీడియాతో కేటీఆర్





హైదరాబాద్ -
పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే భయంతోపాటు చంద్రబాబుకు కోపం వస్తుందనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్కకు పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. కావాలనే ఆ ప్రాజెక్టును పట్టించుకో లేదని చెప్పారు. నీళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడుతున్నదని అన్నారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో మీడియా ప్రతినిధులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. కాలంతో పోటీపడి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. నీళ్లిచ్చింది ఎవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో 45

-మిగతా 2 లో

## వాట్సాప్ 'ఆఫర్ లింక్'లతో జాగ్రత్త

- న్యూఇయర్ గ్రీటింగ్స్‌తో సైబర్ నేరగాళ్ల ఎర
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : టీజీసీఎస్‌బీ హెచ్చరిక

2 లో



# ఉన్నావో రేప్ కేసులో నిందితుడికి నో బెయిల్

మొదటి తరువాయి

న్యాయ మూర్తులు జస్టిస్ జెకె.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసి లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బాధితురాలి భద్రతకు సంబం ధించిన అంశాలతో సిబిఐ ప్రస్తా వించిన అంశాలను ధర్మాసనం ఏకీభవిం చింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్ కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆయన్ని ఆదేశించింది. అలాగే డిసెంబర్ 23న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల జైలు నుంచి విడుదల చేయొద్దని కూడా తెలిపింది. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (పోక్సో చట్టం) సెక్షన్ 5 కింద 'ప్రజా సేవకుడు (పబ్లిక్ సర్వెంట్)' అనే పదానికి హైకోర్టు ఇచ్చిన వివరణ తప్పుగా ఉందని, చివరికి చట్టాన్ని రూపొందించేవారిని మినహాయింపుకు దారి తీస్తుందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. "చట్టపరమైన సమస్యను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఉత్తర్వును జారీ చేసిన హైకోర్టు న్యాయమూర్తులు అత్యుత్తమ న్యాయమూర్తులు. కానీ మనమందరం తప్పులు చేసే అవకాశం ఉంది. దయచేసి పోక్సో కింద "పబ్లిక్ సర్వెంట్" అనేదానికి ఈ నిర్వచనాన్ని చూడండి. చట్టం ప్రకారం ఒక కానిస్టేబుల్ ప్రభుత్వ సేవకుడిగా ఉంటాడని, కానీ శాసనసభ సభ్యుడు మినహాయించడంపై మేము ఆందోళన చెందుతున్నాము" అని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. సిబిఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించగా సెంగార్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, ఎన్. హరిహరన్‌లు వాదించారు.. ఉన్నావో అత్యాచారం కేసు బాధితురాలు స్పందిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. "ఈ నిర్ణయంతో నేను చాలా సంతోషంగా ఉన్నాను. సుప్రీంకోర్టు నుండి నాకు న్యాయం లభించింది. నేను మొదటి నుంచీ న్యాయం కోసం నా గొంతును వినిపిస్తున్నాను" అని బాధితురాలు అన్నారు. "నేను ఏ కోర్టుపైనా ఎటువంటి ఆరోపణలు చేయను. నాకు అన్ని కోర్టులపై నమ్మకం ఉంది. కానీ సుప్రీంకోర్టు నాకు న్యాయం చేసింది. అలానే న్యాయం కోసం పోరాటం కొనసాగుతుంది" అని ఆమె అన్నారు.

## పుతిన్ నివాసంపై దాడికి ఉక్రెయిన్ యత్నం!

మొదటి తరువాయి

**శాంతి ప్రణాళికపై రెఫరెండం**

రష్యాతో యుద్ధం ముగింపు కోసం రూపొందే ఎలాంటి శాంతి ప్రణాళిక అయినా రెఫరెండంలో ఉక్రెయిన్ ప్రజల ఆమోదం పొందాలని జెలెన్‌స్కీ స్పష్టంచేశారు. ప్రతిపాదిత 20 అంశాల శాంతి ప్రణాళిక అనేది కనీసం 60 రోజుల కాల్పుల విరమణ తర్వాతే ముందుకు తేవాలని పేర్కొన్నారు. శాంతి చర్చల్లో ఇంకా అనేక అంశాలు అపరిష్కృతంగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## సనాతన హిందూ ధర్మపరిరక్షణ

మొదటి తరువాయి

'అఖండ- 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉంది. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను. సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లు ఉన్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా. సనాతన ధర్మం గురించి సినిమా చేయాలంటే చాలా ధైర్యం ఉండాలి. ఈ దేశంపైన, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలపై దాడులు జరుగుతున్నా తట్టుకుని నిలబడిదంటే... దానికి కారణం మనం నమ్ముకున్న సనాతన ధర్మమే. ఆ నిరంతర చరిత్రను అద్భుతంగా చూపించిన సినిమా అఖండ- 2. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తే... ధర్మాన్ని సమాజం రక్షించుకోవాలి. అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం కూడా తప్పే. అన్యాయాన్ని ఎదురించి సమాజాన్ని రక్షించేవారే గొప్ప. సనాతన ధర్మం గొప్పతనం వినడం కంటే అఖండ -2 తాండవం సినిమా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై, భారతీయుడుపై ఉంది. మిగిలిన ఈ జీవితాన్ని ధర్మం, దేశం కోసం అర్పించాలని అఖండ-2 చెబుతోంది' అని బండి సంజయ్ ప్రశంసించారు. 'భారత్ ఎప్పటికీ ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం. కోవిడ్ తరుణంలో ప్రపంచమంతా దిక్కులు చూస్తుంటే.... సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ఈ దేశాన్ని పాలిస్తున్న సందర్భంలో కోవిడ్ వస్తే.. ఏ విధంగా ఎదుర్కొన్నారో, ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన దృశ్యాలను మనం కళ్లారా చూశాం. అంతటి యోధుడు నరేంద్రుడు భారత్‌ను పరిపాలిస్తున్నారు కాబట్టే వ్యాక్సిన్‌ను అందించగలిగాం. సైంటిస్టులను ప్రోత్సహించాం. కరోనా వ్యాక్సిన్ అందించిన భారత్ బయోటెక్ హైదరాబాద్‌లో ఉంది. ప్రధాని మోదీ స్వయంగా ఇక్కడికి వచ్చి వ్యాక్సిన్‌ను పరీక్షించారు' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అఖండ -2 తాండవం సినిమాను ప్రతి హిందువు, భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా అన్నారు. 'సనాతన ధర్మాన్ని కాపాడేలా మరిన్ని సినిమాలు రావాలని బండి సంజయ్ సూచించారు.

## తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు

మొదటి తరువాయి

ఆయుధాలు విక్రయిస్తుండగా తైవాన్‌పై చైనా చర్యలకు దిగితే తన సైన్యం జోక్యం చేసుకుంటుందని జపాన్ ప్రధాని సానే తకైచీ బెదిరించారు. ఈ రెండు దేశాల వైఖరులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన చైనా తాజాగా సైనిక విన్యాసాలకు సమాయత్తమైంది. విన్యాసాలపై చైనా సైన్యం సోమవారం ఉదయం చేసిన ప్రకటనలో అమెరికా, జపాన్ దేశాల ప్రస్తావన తేలేదు.

**మోహరింపు ఇలా**

చైనా సైన్యం తైవాన్ జలసంధికి ఉత్తర, నైరుతి దిశలో సుదూర లక్ష్యాలను ఛేదించే రాకెట్లతో పాటు డిస్ట్రాయర్లు, ఫ్రిగేట్లు, ఫైటర్లు, బాంబర్లు, మానవ రహిత గగనతల వాహనాలను మోహరిస్తోంది. జలాలలోని లక్ష్యాలపై కూడా విన్యాసాలు జరుపుతుంది. జలసంధికి తూర్పున ఉన్న జలాలలో, గగనతలంలో ఇప్పటికే సామర్థ్య పరీక్షలు నిర్వహించింది. మంగళవారం ప్రధాన సైనిక విన్యాసాలు జరగబోతున్నాయి. ఆ సమయంలో ప్రత్యక్ష కాల్పులు జరుపుతామని, ద్వీపం చుట్టూ ఉన్న ఐదు ప్రాంతాలలో విన్యాసాలు జరుగుతాయని సైన్యం తెలిపింది. సైనిక విన్యాసాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఓ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది.


**సైన్యాన్ని అప్రమత్తం చేసిన తైవాన్**

చైనా విన్యాసాలపై స్పందించిన తైవాన్ తన సైనిక దళాలను అప్రమత్తం చేసింది. ద్వీపాన్ని కాపాడుకునేందుకు సైన్యం సిద్ధంగా ఉన్నదని తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఇప్పటికే సైన్యాన్ని మోహరించామని, యుద్ధ సన్నద్ధత విన్యాసాలు జరుపుతున్నామని తైవాన్ మరో ప్రకటనలో చెప్పింది.

# అసెంబ్లీలో.. ఆప్యాయత

మొదటి తరువాయి

అలాగే అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కేసీఆర్ వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనకు పలకరించి అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. జీహెచ్‌ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీల విలీనం, జీహెచ్‌ఎంసీ పరిధి పెరిగినందున వార్డుల సంఖ్య 150 నుంచి 300కి పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు, తెలంగాణ జీఎస్టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ తదితర అంశాలకు చట్టబద్ధత కల్పించనున్నారు. తొలిరోజు సభ వాయిదా అనంతరం బీఏసీ సమావేశం నిర్వహించనున్నారు. శాసనసభ, మండలి ఎన్నిరోజులపాటు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనం అయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. కేసీఆర్



సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నందినగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. తిరిగి బాగున్నాను అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు కలిసి కరచాలనం చేశారు. దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పక్షం అప్రమత్తమైనట్టు తెలిసింది. సాగునీటిపై షార్ట్ డిస్కషన్‌ను అనుమతించి సాధ్యమైనంత వరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరణతోనే నెట్టుకురావాలని నిర్ణయించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు సాగదీయకుండా రెండు, మూడు రోజుల్లోనే ముగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, అసెంబ్లీ చరిత్రలో మొదటిసారిగా జ్యుడీషియరీ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి ఆర్ తిరుపతి అసెంబ్లీ కార్యదర్శి హోదాలో శాసనసభను నడిపించబోవడం విశేషం. ఇప్పటి వరకు అసెంబ్లీ క్యాడర్ అధికారులే ఈ బాధ్యత నిర్వర్తించేవారు.

# నీళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ

మొదటి తరువాయి

టీఎంసీలకు ఒప్పుకుంటే నష్టమేనని అన్నారు. కృష్ణా నదిలో 299 టీఎంసీలకు అంగీకరించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయనే కారణంతోనే ఆయన బూతులు మాట్లాడుతున్నారని చెప్పారు. తనపై వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోననీ, తన తండ్రి కేసీఆర్‌పై మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులు బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. నీళ్ల అంశం చదివితే రాదనీ, రాష్ట్రంపై ప్రేమ ఉండాలని వ్యాఖ్యానించారు. కృష్ణా నది ఏ బేసిన్‌లో ఉందో, ఎక్కడ ఉందో అని ముఖ్యమంత్రి అధికారులను అడిగారని ఎద్దేవా చేశారు. బాక్రానంగల్ ఏ రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రికి తెలియదన్నారు. నీటిపారుదలపై కనీస అవగాహన లేని వారు కేసీఆర్ చర్చకు రావాలంటున్నారని చెప్పారు. చెక్‌డ్యాం పేల్చివేత కేసులో రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఉన్నదనీ, మేడిగడ్డ పేల్చారంటూ ఆనాడే ఇంజినీర్లు ఫిర్యాదు చేశారని అన్నారు. ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు.

**ఫోర్త్ సిటీని కార్పొరేషన్ చేస్తారేమో**

జీహెచ్‌ఎంసీని మూడు భాగాలుగా విభజిస్తారన్న ప్రచారం జరుగుతున్నని కేటీఆర్ చెప్పారు. ఫోర్త్ సిటీ అని పెట్టిన దాన్ని కూడా కార్పొరేషన్ చేస్తారేమోనని అన్నారు. ఏం చేసినా శాస్త్రీయంగా ఉండాలనీ, ఇష్టం వచ్చినట్టు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. డబ్బుల సేకరణ ఓసమే మర్చంట్ బ్యాంకర్లు, బ్రోకర్లు చెప్పినట్టు డీలిమిటేషన్ చేస్తున్నారని ఆరోపించారు. అడ్డగోలుగా వార్డుల విభజన చేశారని అన్నారు. గూఢచారి వ్యవస్థ నెహ్రూ కాలం ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉందన్నారు. శాంతిభద్రతలు, రాష్ట్ర రక్షణ కోసమే ఈ వ్యవస్థ పనిచేస్తుందని చెప్పారు. నిఘా వ్యవస్థ లేదా ఫోన్ ట్యాపింగ్ లేదని ఎవరైనా అనగలరా?అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం లేదని ముఖ్యమంత్రి చెప్పగలరా?అని అడిగారు. సిట్, ఫోన్ ట్యాప్ వంటి అంశాలతో ప్రజల దృష్టిని ఎంతకాలం మళ్లిస్తారని చెప్పారు. సర్పంచ్ ఎన్నికలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండమని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పరిపాలనను తిరస్కరించారని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం రేవంత్‌రెడ్డికి ఉంటే చాలని అన్నారు. అయితే ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే బాగుంటుందని చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకూల వాతావరణం ఉంటే మంచిదని అన్నారు. గడ్డం పెంచిన ప్రతిఒక్కరూ గబ్బర్‌సింగ్ కాదన్నారు. గడ్డాలు పెంచడం సులభమనీ, పాలన చేయడమే కష్టమని చెప్పారు. రేవంత్‌రెడ్డి గడ్డం, మీసాలు లేవన్నది తనను కాదనీ, రాహుల్‌గాంధీ, రాజీవ్‌గాంధీని కూడా అన్నారని అన్నారు.

## ఇక 28 జిల్లాలు

మొదటి తరువాయి

ఒక జిల్లాగా ఏర్పాటు చేయలేమని కాబట్టి దీనిని అన్నమయ్య జిల్లాలోనే ఉంచినట్లు వివరించారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను ఈ నెల 31వ తేదిన విడుదల చేస్తామన్నారు. గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, కోట, చిల్లకూరు మండలాలను నెల్లూరు జిల్లాలో కలుపుతున్నట్లు చెప్పారు. మిగిలిన రెండు మండలాలను తిరుపతి జిల్లాలోనే ఉంచుతున్నట్లు తెలిపారు.

కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు రోడ్డు భద్రత పన్ను వసూలు చేసేందుకు ఆమోదం తెలిపింది. లైఫ్ ట్యాక్స్ చెల్లించే నగదులో 10శాతం ఈ పన్ను కింద వసూలు చేసేలా ఆర్డినెన్స్ జారీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రతి నెలా సుమారు 73వేల కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతాయని, ఈ పన్ను ద్వారా నెలకు రూ.22.5 కోట్లు, ఏడాదికి రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. రాజధాని అమరావతిలో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు కోసం నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) నుంచి నాబార్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ (ఎన్ఐడిఎ) స్కీం కింద రూ.7387.70 కోట్ల అప్పు పొందేందుకు సిఆర్‌డిఎ కమిషనర్‌కు అనుమతి ఇచ్చింది. జిఎస్‌డిపిలో 0.50శాతం వరకు అదనపు రుణాన్ని పొందేందుకు అన్ని ప్రభుత్వ భవనాల్లో స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లను అమర్చనుంది. ఎపి పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఎపిపిసిసి) సభ్యుల కన్వీనర్ చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

## వాట్సాప్ 'ఆఫర్ లింక్'లతో జాగ్రత్త

**న్యూఇయర్ గ్రీటింగ్స్‌తో సైబర్ నేరగాళ్ల ఎర**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : టీజీసీఎస్‌బీ హెచ్చరిక**

హైదరాబాద్




నూతన సంవత్సర వేడుకల సమయంలో వాట్సాప్, ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో 'ఆఫర్' లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) ప్రజలను హెచ్చరించింది. ఈ విషయంలో అప్రమత్తత అవసరమని సూచించింది. ఈ మేరకు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శికా గోయల్ ఒక ప్రకటనను విడుదల చేశారు. వాట్సాప్, ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విస్తరిస్తున్న నకిలీ 'హ్యాపీ న్యూ ఇయర్' శుభాకాంక్షలు, బహుమతులు, ఆఫర్ లింక్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని టీజీసీఎస్‌బీ సూచించింది. సైబర్ నేరగాళ్లు పండుగ వాతావరణాన్ని ఆసరాగా చేసుకుని% ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డు సంవత్సరాంత ఆఫర్లు, నూతన సంవత్సర బహుమతులు, ప్రయాణ రాయితీలు, ఈవెంట్ టికెట్లు వంటి పేర్లతో లింక్‌లను పంపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని వివరించింది.

## రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు

మొదటి తరువాయి

ఏర్పాటు చేశామన్నారు. ఫెర్టిలైజర్ (యూరియా) యాప్, యూరియా పంపిణీలపై కలెక్టర్లతో సోమవారం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ రబీకి కేంద్ర ప్రభుత్వం మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రావాల్సిన 5.60 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 5.70 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నాయని వివరించారు. ఈ సీజన్‌లో రోజుకు సగటుగా 8,692 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 3.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు కొనుగోలు చేశారని, ఇది గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికం అని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని చెప్పారు. వ్యవసాయశాఖ ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ (యూరియా) యాప్ ను ఆదిలాబాద్, మహబూబ్ నగర్, జనగామ, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో అమలు చేయగా.. 82,059 మంది రైతులు ఆ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసి 2,01,789 యూరియా బస్తాలు కొనుగోలు చేశారనీ, కేవలం 9 రోజుల్లోనే ఈ జిల్లాల్లో రోజుకు 22,000కు పైగా బస్తాలు పంపిణీ అయ్యాయని వివరించారు. యాప్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినా అధికారులు వెంటనే పరిష్కరించారని రైతులు కూడా యూరియా యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. యాప్ అనేది కేవలం రైతుల సౌకర్యార్థం తెచ్చినది మాత్రమేననీ, దాని ద్వారా యూరియా అమ్మకాలు పారదర్శకంగా జరుగుతున్నాయని చెప్పారు. యాప్ అమలులో లేని జిల్లాలలో కూడా యూరియా సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల వారీగా యూరియా స్టాక్, డిమాండ్, పంపిణీపై జిల్లా కలెక్టర్లు నిశితంగా పర్యవేక్షించాలని, అవసరమైతే అదనపు సేల్స్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. యూరియా పంపిణీపై మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాలను ఉదయాన్నే తెరిచేలా చర్యలు తీసుకోవాలని, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు తెప్పించుకొని, సాయంతం జిల్లా అధికారులతో సమీక్ష చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ మాట్లాడుతూ.. ప్రతి పీఏసీఎస్ సెంటర్లలో మూడు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలనీ, రైతుల సౌకర్యం కోసం శామియానా, తాగునీరు లాంటి సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్ ఫెడ్ ఎమ్‌డీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆపరేటీవ్ అడిషనల్ రిజిస్ట్రార్ చంద్రమోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తొమ్మిదో రోజుకు చేరుకున్న పత్రీజీ ధ్యాన మహాయాగం











## ధ్యాన సాధనయే భక్తి యోగం- బ్రహ్మర్షి పితామహ పత్రీజీ

**కడ్తాల్, డిసెంబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** పత్రీజీ ధ్యాన మహాయాగంలో బ్రహ్మర్షి పత్రీజీ వీడియా సందేశంలో భక్తి అనే అంశం గురించి ధ్యానులకు చక్కటి జ్ఞానాన్ని అందించారు. మీరాదేవికి కృష్ణుడి మీద భక్తి అని, సంగీతప్రియులకు సంగీతం పట్ల, ఆదిశంకరాచార్యులకు ఆత్మజ్ఞానం మీద, గౌతమ బుద్ధుడికి ధ్యానం మీద , పిరమిడ మాస్టర్లకు ధ్యాన ప్రచారం మీద భక్తి అని తెలిపారు. భక్తి విశేషం అన్ని చోట్ల ఉందన్నారు. భక్తి అంటే సమర్పణ అని తెలియజేసారు. మనసొంత స్వరూపంతో అనుసంధానం కావడమే భక్తి అని వివరించారు. భక్తి అంటే మనగురించి మనం తెలుసుకోవడం, నేను అంటే ఏమిటీ, నా స్వస్వరూపం ఏమిటీ? దానికి ఎలా చేరుకోవాలి అని తెలుసుకోవడం అని చెప్పారు. పీఎస్ఎస్ఎం కూడా ఇదే చెబుతుందన్నారు. ధ్యాన సాధనయే భక్తి యోగమని, ధ్యాన సాధన కాకుండా భక్తి యోగం ఎక్కడా లేదని స్పష్టం చేసారు. శ్రీకృష్ణుడు కూడ భగవద్గీతలో అర్జునుడితో నీతో నీవు గడుపు, యోగివికా, ధ్యాన సాధన చేయి అని బోధించారని చెప్పారు. పిరమిడ్ మాస్టర్లందరూ భక్తాగ్రసులన్నారు. అనాసాన సతి భక్తి యోగానికి దారి అని స్పష్టం చేసారు

**ఎలాంటి భయంలేకుండా జీవించాలి- పరిణిత పత్రి..**

ధ్యానులు ఎలాంటి భయంలేకుండా జీవించాలన్నారు బ్రహ్మర్షి పత్రీజీ కూతురు పరిణిత పత్రీ. ప్రతి పిరమిడ్ మాస్టర్ నిర్భయంగా జీవిస్తారని తెలిపారు. ధ్యానం చేసే వారు నిర్భయంగా ఉంటారన్నారు.గతం నుంచి భయం పుడుతుందని చెప్పారు. మనం సన్మార్గంలో నడుస్తున్నప్పుడు విశ్వం తోడుగావుంటుందని, దేనికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. భయంతో ఒత్తిడి పెరిగి అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు ఆధ్యాత్మికంగా ఎదిగితే భయంపోతోందని చెప్పారు. అదేవిధంగా ధ్యానసాధనతో భయాలను తొలిగిపోతాయన్నారు. ధ్యానం బాగా చేసి ఆత్మశక్తిని పెంచుకోవాలని సూచించారు. ప్రకృతికి వ్యతిరేకంగా వెళ్లకుండా, చట్టాలకు వ్యతిరేకంగా వెళ్లకుండా మంచి మార్గంలో నడిస్తే దేనికి, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసారు

**బ్రహ్మర్షి పత్రీజీ ధ్యానాన్ని అందరికీ చేరువచేసేందుకు ఎన్నో త్యాగాలు చేసారు.**

దాట్ల హన్మంతరాజుబ్రహ్మర్షి పత్రీజీ కి కృతజ్ఞతగా ప్రతి ఒక్కరికీ ధ్యానం నేర్పించాలని ధ్యానులకు,పిరమిడ్ మాస్టర్లకు సూచించారు పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ దాట్ల హన్మంతరాజు. బ్రహ్మర్షి పత్రీజీ ఎంతో త్యాగం చేసి జీవితాంతం కృషి చేసి అందరికీ ధ్యానం అందించారని కొనియాడారు. కొత్తవారికి ధ్యానం నేర్పించి, పిరమిడ్ నిర్మాణం చేస్తున్నవారికి సహాయం చేసి, బ్రహ్మర్షి పత్రీజీకి కృతజ్ఞత తెలియజేయాలని కోరారు. ధ్యానం, సేవ రెండు ముఖ్యమైనవే అని స్పష్టం చేసారు. పత్రీజీ ధ్యాన మహాయాగం విజయవంతం చేసేందుకు హైదరాబాద్, భాగ్యనగర్ ట్రస్ట్ సభ్యులు గత కొద్ది నెలలుగా కఠోర శ్రమ చేస్తున్నారని ప్రశంసించారు.ఇంత గొప్ప కార్యక్రమానికి అన్నీ విధాలుగా చేయూత ఇవ్వాలని ధ్యానులను కోరారు. అన్నదానానికి మించిందిలేదని, అందరూ అన్నదానానికి తమ వంతు సహాయం అందించాలన్నారు. బ్రహ్మర్షి పత్రీజీ ఆశయాలైన ధ్యానజగత్, శాకాహారజగత్, పిరమిడ్ జగత్ ల కోసం ప్రతి ధ్యాని విశేష కృషి చేయాలని కోరారు.

## మృతుడి కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



**కడ్తాల్, డిసెంబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలం సలార్పూర్ గ్రామానికి చెందిన ఉదరి శ్రీను యాదవ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి ఉదరి శీను యాదవ్ కుటుంబ సభ్యులను పమర్శించారు. అనంతరం శీను యాదవ్ కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. సలార్పూర్ సర్పంచ్ ప్రియా రమేష్ 3వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి పంతు, ఉప సర్పంచ్ మహేశ్వరి కుమార్, వార్డు సభ్యులు జైపాల్,మల్లేష్,రాజేశ్వరి, రమేష్, జిజాలి,రాములు, నాయకులు బాబా పాండు, రాజేందర్, నరేష్, దాస్య, రవికుమార్, దశరథ్,జంగయ్య, శ్రీధర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మనోహరాబాద్ సర్పంచ్



**మనోహరాబాద్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో రాజకీయ పరిణామాలు కొత్త మలుపు తిరిశాయి. గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్ ఆదివారం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.గ్రామ సర్పంచ్ ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో విఠల్ రెడ్డి, పురం రవి, సత్తిరెడ్డి, నాగిరెడ్డి, నిమ్మల యాదగిరి, అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు. యువకులు కూడా పెద్ద ఎత్తున హాజరై కాంగ్రెస్ పార్టీలో చేరడం విశేషం.

## ఎంపీపీ పాఠశాలను అకస్మిక తనిఖీ ఎంఈఓ

**నాంపల్లి డిసెంబర్ 29 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
నాంపల్లి మండలం ఎస్ డబ్ల్యూ లింగోటం ఎంపీపీపాఠశాల పర్యవేక్షణలో భాగంగా సోమవారం ఉదయం 9 గంటలకు ఎంపీపీ ఎస్ లింగోటం పాఠశాలను ఎంఈఓ మల్లికార్జున రావు ఆకస్మికతనికి చేయడం జరిగింది ముఖ్యంగా మూడవ తరగతి విద్యార్థులకు ఎఫ్ ఎల్ ఎస్ మాక్ టెస్ట్ 31 లోపు నిర్వహించాలని మరియు ప్రతి పాఠశాలలో ఐటమ్ బ్యాంక్ జిరాక్స్ కాపీ ఉంచి విద్యార్థులకు ప్రాక్టీస్ చేయించాలని తెలిపారు. టీచర్ సపోర్ట్ గ్రూప్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలియజేశారు



## తలకొండపల్లి మండలంలో ఇందిరమ్మ చీరల పంపిణి






**తలకొండపల్లి, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెంకటరావుపేట, గడ్డమీది తండా గ్రామ పంచాయతీలలో మహిళల కోసం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామంలోని మహిళలకు చీరలను అందజేసి ఆనందాన్ని పంచిన ఈ వేడుకలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.వెంకట్రావుపేట్ గ్రామ సర్పంచ్ ఇమ్మడి మహేష్, గడ్డమీది తండా సర్పంచ్ భణావత్ సరోజా భీమ్లాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి జమీర్, ఉపసర్పంచ్ పోలే ప్రశాంత్, వార్డు సభ్యులు చప్పిడి హుస్సేన్, సంతోష రాజు, శంకరయ్య, శ్రీను, అరుణతో పాటు బుక్ కీపర్, గ్రామ మహిళలు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.


## బిల్లులు చెల్లించకుండా అరెస్ట్ చేస్తారా

ప్రభుత్వ తీరుపై రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మండిపాటు



**కడ్తాల్, డిసెంబర్ 29 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
: తెలంగాణ వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు.పెండింగ్ బిల్లులు ఇవ్వాలని రెండు సంవత్సరాలుగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన సుమారు 1000 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రోజు సర్పంచుల అసెంబ్లీ ముట్టడి మేరకు ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడం దారుణమని అన్నారు.వందల కోట్ల రూపాయల బకాయిలు ఉంటే 153 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు.సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అందాల పోటీలకు, గ్లోబల్ సమ్మిట్లకు పైసలున్నాయి కానీ గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచుల పెండింగు బిల్లుల విడుదలకు నిధుల లేవా ?? అని ప్రశ్నించారు.అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.

## బీఆర్ఎస్ శ్రేణుల ముందస్తు అరెస్టు




**ఆమనగల్లు, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండల రాంనుంతల సర్పంచి శ్రీను నాయక్, మాజీ సర్పంచి లక్ష్మణ్ ను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. బీ ఆర్ఎస్ హయాంలో కేటాయించిన నిధులు మంజూరు కాకపోవడంతో , అప్పులు చేసి గ్రామాల్లో పనులు కొనసాగించామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలను గ్రామంలోకి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

## చేగూర్-చించోడు-మొగిలిగిద్ద గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి డిమాండ్




**షాద్‌నగర్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్** :చిన్న మండలాల ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, మౌలిక వసతుల ఏర్పాటు సులభమవుతుందని ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తూ షాద్‌నగర్ నియోజకవర్గంలోని చేగూర్, చించోడు, మొగిలిగిద్ద గ్రామాలను ప్రత్యేక మండలాలుగా ఏర్పాటు చేయాలని తెలంగాణ శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గట్టిగా కోరారు. ప్రజల తరఫున తన వాయిస్‌ను వినిపిస్తూ, ఈ గ్రామాల అభివృద్ధి కోసం మండల స్థాయి పరిపాలన అవసరమని స్పష్టం చేశారు.అంతేకాకుండా, ఏడాది క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం బాధాకరమని మండలిలో ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం వెంటనే స్పందించి పనులను ప్రారంభించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ కు మీసాల వర్షిత్ రాజీనామా



**ఆమనగల్లు, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ సోషల్ మీడియా తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహించిన మీసాల వర్షిత్ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేశారు. కొన్ని సంవత్సరాలుగా క్రియాశీలకంగా తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ లో కీలకంగా పనిచేసిన వర్షిత్ ప్రస్తుత సామాజిక అంశాల పట్ల స్వతంత్రంగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ కు రాజీనామా చేస్తున్నానని విలేకరుల సమావేశంలో చెప్పారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసే సమయంలో సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రతి ఒక్క కార్యకర్త వ్యవస్థాపక అధ్యక్షుడి సహకారం మరువలేనిదని తెలిపారు.భవిష్యత్తు కార్యాచరణ విద్యార్థి సమాజం కొరకు నిరంతరం గొంతెత్తి చాటుతానని భీమా వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై ప్రతినిత్యం ప్రశ్నిస్తూ వారి హక్కులకై నిరంతరం పోరాటం చేస్తానని,అదేవిధంగా నా యొక్క విధి విధానాల పట్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో కార్యచరణ ప్రకటిస్తానని తెలియజేశారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్




**ఆమనగల్లు, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** :యువత చెడు మార్గాలకు దూరంగా ఉండి,గ్రామీణా ప్రాంతంలోని క్రిడాకారుల లోని ప్రతిభను బయటికి తీయాలానే ఉద్దేశ్యంతోనే క్రికెట్ టోర్నమెంట్ ని ర్వహించామని ఆమనగల్లు మాజీ ఎంపీపీ అనిత అన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ గ్రామం లో వారం రోజులపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఈ టోర్నమెంట్లో మొత్తం పది జట్లు పాల్గొనగా చివరిగా మేడిగడ్డ జట్టు టీమ్ విన్నర్స్ గా గెలిచి, చత్రపతి శివాజీ జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి ఆమనగల్లు మాజీ ఎంపీపీ అనిత నగదు, బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మేడిగడ్డ సర్పంచి రాజేశ్వరి, మాజీ సర్పంచి అంబర్ సింగ్, సభ్యులు మల్లేష్, హనుమంత్, భాస్కర్, మణిపాల్,సీతారాం, దేవేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్‌లో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ





**ఫరూక్‌నగర్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఫరూక్‌నగర్ మండల రాయికల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గందె సురేష్ మాట్లాడుతూ, షాద్నగర్ ఆర్యవైశ్య వ్యాపారస్తుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా 25 వేల నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టామని, అందులో భాగంగా రాయికల్ గ్రామంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించడం



ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫరూక్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, షాద్నగర్ లక్ష్మీ స్టీల్ అండ్ సిమెంట్ అధినేత ఉప్పల శివ అండ్ బ్రదర్స్, మాజీ అధ్యక్షులు హనుమారి మురళీధర్, ఎల్కుర్తి జగదీశ్వర్, మండల కోశాధికారి గజవాడ యశ్వంత్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది శ్రీనివాస్, సామాజిక కార్యకర్త నీల రవీందర్ పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్, ఉపసర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు శ్రీను, వేణు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సీఐటీయూ అఖిలభారత మహాసభలకు పిలుపు




**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** సీఐటీయూ కరీంనగర్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో యు. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగబోయే సీఐటీయూ అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.జనవరి 4న విశాఖపట్నంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్సేన్ హాజరవుతారని చెప్పారు. కార్మిక వర్గానికి నష్టకరమైన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, ఫిబ్రవరిలో జరగబోయే దేశవ్యాప్త సమ్మెపై ప్రతినిధులు చర్చించనున్నారని వివరించారు.ప్రస్తుత సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, జాతీయ-అంతర్జాతీయ పరిణామాలు కార్మిక, కర్షక వర్గాలపై పడుతున్న ప్రభావాలను మహాసభలో విశ్లేషించనున్నట్లు తెలిపారు. శ్రమశక్తి నీతి, విద్యుత్ సవరణ చట్టం 2025, ఉపాధి గ్యారెంటీ లేని వి.బి.జి. రాం జీ చట్టం వంటి నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కార్మికులు, రైతులు, కూలీలతో కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, ఎం. మహేందర్ పాల్గొన్నారు.

## గొర్రెలకు, మేకలకు ఉచిత మందులు, విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ




**మానకొండూర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పశు వైద్య కేంద్రంలో పశు గణన అధికారి ఒలగుత్తుల పోచయ్య ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ ఎడ్ల సత్యనారాయణ, ఉపసర్పంచ్ రాపాక ప్రవీణ్ పాల్గొని మందులు అందజేశారు. ఈ సందర్భంగా దాదాపు 1500 గొర్రెలు, మేకలకు మందులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని గొర్రె కాపర్లు, సంఘ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అదే రోజు ఊటూర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు “మోడీ కానుక”గా సైకిళ్లు పంపిణీ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైకిళ్లు స్వీకరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యా అధికారి మధుసూదనాచారి, బిజెపి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లోకో పైలట్లకు సంరక్ష పురస్కార్ అవార్డులు



**పాలకుర్తి, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** విధి నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరించిన ఇద్దరు లోకో పైలట్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు సన్మానించారు. సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ గోపాల కృష్ణ చేతుల మీదుగా సంరక్ష పురస్కార్ అవార్డులు అందజేశారు. అతి వేగంతో వెళుతున్న రైలు వ్యాగన్‌లో బోల్టులు ఊడిపోవడంతో వ్యాగన్ ఒకవైపు వంగి ప్రమాదం సంభవించే పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో సమస్యను గమనించిన లోకో పైలట్లు రైలు వేగాన్ని తగ్గించి పట్టాలు తప్పకుండా కాపాడారు. ప్రభుత్వ ఆస్తిని రక్షించినందుకు ఈ అవార్డులు లభించాయి.ఈ అవార్డును పొందిన వారిలో పాలకుర్తి గ్రామానికి చెందిన సీహెచ్. రవి, ఆయన సహోద్యోగి ప్రేమ్ కుమార్ ఉన్నారు. సికింద్రాబాద్‌లో జరిగిన సేఫ్టీ సమావేశంలో సంరక్ష పురస్కార్‌తో పాటు సేఫ్టీ మెడల్ కూడా అందజేయబడింది. తోటి ఉద్యోగులు, గ్రామస్థులు వీరిని అభినందిస్తూ గర్వంగా భావించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం




**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరంగా మారిందని, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని ఆదుకుంటోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. స్థానిక సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో సోమవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా మారిందని, గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో దాదాపు ఐదు వందల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో కూడా బాధితులు సుడా కార్యాలయాన్ని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెక్కులు పొందిన వారిలో పాకాల జ్యోతి, వరాల స్వామి, మహమ్మద్ యాకుబ్, జేరిపోతుల నర్సింగం, లింగంపల్లి పుణ్యవతి, మహమ్మద్ షెఫీ, చర్ల రజిత, దారం స్రవంతి, షైరిన్, ఐలయ్య, సుధాకర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గుండాటి శ్రీనివాస్ రెడ్డి, శబానా మహమ్మద్, సయ్యద్ ఖలీల్, మాసూమ్ ఖాన్, ముల్కలా యోనా, జాఫర్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వచ్చిన విద్యుత్ అధికారులకు ఘన సన్మానం



**పాలకుర్తి, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పాలకుర్తి మండలం బసంతనగర్ సెక్షన్‌కు పదోన్నతి పొంది బదిలీపై వచ్చిన ఇద్దరు విద్యుత్ అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఎం.డి. రహీం లైన్ ఇన్స్పెక్టర్ నుండి సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్‌గా, కాసుల కిరణ్ లైన్ మెన్ నుండి లైన్ ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి పొంది ఆదివారం బసంతనగర్ సెక్షన్ ఏఈ మానాల ప్రసాద్ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈశాల తక్కల్లపల్లి గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఒడ్నాల జ్యోతి రాజు, వార్డు సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొని కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వర్క్ అడ్జస్ట్మెంట్ లో పొరపాటును చేయాలని ఉపాధ్యాయుడి వినతి



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జిల్లాలో వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియలో జరిగిన పొరపాటును సరిచేయాలని ఒక సీనియర్ ఉపాధ్యాయుడు ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌కు వినతి సమర్పించారు.ఆయన వివరాల ప్రకారం, తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఎస్సే తెలుగు పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ, 56 మంది విద్యార్థులు ఉన్న తమ పాఠశాలలో ఆ పోస్టును నింపకపోవడం అన్యాయమని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయుడైన తనను ఇబ్బందికరమైన పాఠశాలలో నియమించడం, జూనియర్ ఉపాధ్యాయులను సౌకర్యవంతమైన పాఠశాలలో ఉంచడం అన్యాయమని పేర్కొన్నారు.అదేవిధంగా, 3170 ట్రాన్స్ఫర్‌కు వ్యతిరేకంగా తన అలాట్మెంట్ జరగడం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వినతి పత్రాన్ని స్వీకరించకపోవడం, తన వినతి పత్రం సమర్పించిన తర్వాత కూడా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ తన స్థానాన్ని భర్తీ చేయకుండా పగతో ఇతర ఉపాధ్యాయుడిని నియమించడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

## తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పొన్నం అశోక్ గౌడ్ నామినేషన్



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా సోమవారం పొన్నం అశోక్ గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో, అశోక్ గౌడ్‌కు మద్దతుగా కరీంనగర్ కోర్టు నుండి న్యాయవాదులు రెండు బస్సులలో హైద్రాబాద్‌కు తరలివెళ్లి నామినేషన్ కార్యక్రమంలో భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, లీగల్ సెల్ బాధ్యులు అశోక్ గౌడ్ భారీ మెజారిటీతో గెలవాలని ఆకాంక్షిస్తూ ముందస్తు అభినందనలు తెలిపారు.

# జిల్లా విద్యాధికారుల నిర్లక్ష్యంపై యుఎస్ఎఫ్ఐ సూచన జారీ చేసింది



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) జిల్లా ముఖ్య నాయకుల సమావేశం కరీంనగర్‌లో జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడు అల్లెపు అభిలాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అనుమతి లేకుండా పాఠశాలలు, కళాశాలలు నడుస్తున్నా విద్యాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న వేళ అనుమతులు లేని విద్యాసంస్థలు కొనసాగుతుండటం విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందని తెలిపారు. పరీక్షలలో హాల్ టికెట్లు రాకపోతే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. మార్కుల ర్యాంకుల కోసం విద్యార్థులను ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని, దీనివల్ల వారు తీరుబందుల పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని అనుమతి లేని, ఒకే పేరుతో అనేక క్యాంపస్‌లు నడుపుతున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసి యజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సంద గణేష్, నాయకులు నిపుణ రాజ్, భాను తేజ, ధనుంజయ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు

## బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని వినతిపత్రం సమర్పించారు



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన రిజర్వేషన్ చట్టాన్ని గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపి ఏడు నెలలు గడిచినా, 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రధానమంత్రి అపాయింట్మెంట్ తీసుకుని అన్ని బీసీ సంఘాలను ఢిల్లీకి తీసుకెళ్లి చర్చిస్తామని చెప్పిన వాగ్దానం అమలు కాలేదని విమర్శించారు. బీసీల పట్ల కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యం కపటప్రేమను స్పష్టంగా తెలియజేస్తోందని అన్నారు.తెలంగాణలో ఉన్న బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీలు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రధానమంత్రిని ఒప్పించి రిజర్వేషన్ అమలుకు తోడ్పడాలని, లేకుంటే బీసీ సమాజం ప్రజా ఉద్యమాన్ని లేవనెత్తుతుందని హెచ్చరించారు.ఈ వినతి పత్రం సమర్పణలో జిల్లా కోశాధికారి పైడిపల్లి రాజు, కార్యవర్గ సభ్యులు కే. సదానందం, రేగుల కుమార్, జి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గ సమావేశం



**గంగాధర, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల ఉప సర్పంచ్‌ల ఫోరం తొలి నూతన కార్యవర్గ సమావేశం కొండగట్టులో జరిగింది. ఫోరం అధ్యక్షుడు గుండారపు మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచులు కీలక పాత్ర పోషించాలని తీర్మానాలు చేశారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అందరం కలిసి పనిచేస్తామని ఉప సర్పంచులు సంకల్పం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు తుమ్ రాజ్ కుమార్, గాలిపెల్లి శ్రీనివాస్, గుంటుకు ఆంజనేయులు, అన్నలా దాస్ తిరుపతి, ఉపాధ్యక్షులు ఆసిఫ్, జక్కుల అనుష, రసూరీ సంజీవ్, నేరెళ్ల ఐలయ్య, గౌరవ అధ్యక్షులు వేల్పుల లచ్చవ్వ, రామ్ రెడ్డి, కార్యదర్శులు మెట్ట లత, పిట్టల కమలాకర్, నేరెళ్ళ సుస్మిత, పండుగ గగన్ కుమార్, బట్టు చంద్రశేఖర్‌తో పాటు వివిధ గ్రామాల ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## ఎంటర్ప్రెన్యూర్షిప్ అభివృద్ధి సెల్ ఆధ్వర్యంలో మహిళా డిగ్రీ కళాశాలలో రంగోలీ అమ్మకాల కార్యక్రమం



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి, కరీంనగర్‌లో ఎంటర్ప్రెన్యూర్షిప్ అభివృద్ధి సెల్ ఆధ్వర్యంలో విద్యార్థుల వ్యాపార నైపుణ్యాలను పెంపొందించేందుకు రంగోలీ అమ్మకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సృజనాత్మకతను వ్యాపారావకాశాలుగా మార్చుకుంటూ ప్రణాళిక, ధర నిర్ణయం, మార్కెటింగ్, ఖాతాల నిర్వహణ వంటి అంశాల్లో ప్రాక్టికల్ అనుభవాన్ని పొందారు. రంగురంగుల అందమైన రంగోలీలను తయారు చేసి బోధన, బోధనేతర సిబ్బందికి విక్రయించారు. సిబ్బంది మంచి స్పందన చూపి విద్యార్థుల ఎంటర్ప్రెన్యూర్షిప్ స్ఫూర్తిని ప్రశంసించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, జట్టు భావన, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆర్థిక అవగాహన పెరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగడానికి అవసరమైన ప్రాక్టికల్ జ్ఞానాన్ని అందించడంలో ఎంటర్ప్రెన్యూర్షిప్ అభివృద్ధి సెల్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎంటర్ప్రెన్యూర్షిప్ అభివృద్ధి సెల్ కన్వీనర్ డా. బి. రజనీ దేవి, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా. అఫ్సరీ ఉస్మాని, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరుపుకుందాం



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారని సామాజిక సేవకుడు, ఔట్ స్టాండింగ్ మెగా బ్లడ్ డోనర్, మదర్ థెరిస్సా జాతీయ అవార్డు గ్రహీత గాలిపెల్లి కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సరాన్ని ఆనందంగా స్వాగతించుకోవడం ప్రతి ఒక్కరి హక్కే అయినప్పటికీ, ఆ ఆనందం ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండకూడదని సూచించారు. కేక్ కటింగ్లు, బైక్ ర్యాలీలు, అనుమతి లేని పార్టీలు, డీజేలు, భారీ సౌండ్ బాక్సులతో శబ్ద కాలుష్యం సృష్టించడం చట్టరీత్యా నిషేధమని స్పష్టం చేశారు.ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లోనే శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని, ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై తగిన పర్యవేక్షణ ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల క్షేమమే పోలీసుల ప్రధాన ధ్యేయం, యువత క్షేమమే సమాజ భవిష్యత్తు అని కుమార్ పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో కరీంనగర్ జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, భద్రతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ చౌక్ నుండి మహాత్మ జ్యోతిరావు పూలే గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని, శాస్త్రీయ విద్యా విధానం అమలు చేసి అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్నది తమ లక్ష్యమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వికసిత భారత్ శిక్షా అధిష్ఠాన్ -2025 చట్టం ఉన్నత విద్యను రాజకీయీకరించే ప్రయత్నమని, దీనిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం 20-20ని రద్దు చేయాలని కూడా కోరారు.జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందని, భవిష్యత్తులో విద్యా సమస్యలపై మరింత ఉద్యమాలకు సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలపై పోలీసుల ఆంక్షలు

**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా డిసెంబర్ 31 రాత్రి ప్రత్యేక ఆంక్షలు అమలులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.కమిషనరేట్ వ్యాప్తంగా 44 చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. లోయర్ మానేరు డ్యామ్ కట్ట, తీగల వంతెనపై వేడుకలకు అనుమతి లేదని, అక్కడ నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ కొనసాగుతుందని చెప్పారు.డీజేలు, భారీ సౌండ్ బాక్సులు, బాణాసంచా వినియోగంపై పూర్తి నిషేధం విధించబడింది. డ్రగ్స్ వాడకంపై ప్రత్యేక నిఘా ఉంచి, పట్టుబడిన వారిపై ఎన్‌డిపిఎస్



చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ పర్యవేక్షణ చేస్తాయని, ముఖ్య ప్రాంతాల్లో పికెట్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి. మద్యం మత్తులో వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దు. పోలీసులకు సహకరించి కొత్త సంవత్సరాన్ని సుఖశాంతులతో స్వాగతించండి అని సీపీ గౌస్ ఆలం విజ్ఞప్తి చేశారు.

## సర్పంచ్ అభ్యర్థులకు సన్మానం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న గంగుల కమలాకర్





**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూరు నియోజకవర్గంలోని రేణిగుంట గ్రామ సర్పంచ్‌గా గెలుపొందిన ఎలుక ఆంజనేయులు పాలకవర్గ సభ్యులతో కలిసి కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కమలాకర్ శాలువా కప్పి మిఠాయి తినిపించి అభినందించారు. తరువాత ఆయన కరీంనగర్ శ్వేత హోటల్‌లో బ్యూటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ముందస్తు నూతన సంవత్సర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న 12వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలను అందజేశారు.కరీంనగర్ నగరంలోని డీమార్ట్ ఏరియాలో ఈక్యూనిక్స్ జిమ్ వార్షికోత్సవ వేడుకలకు కూడా హాజరైన కమలాకర్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు.ఈ కార్యక్రమాల్లో జిమ్ నిర్వాహకులు ప్రేమ్ కుమార్, సందీప్, అజయ్, రవి, మాజీ కార్పొరేటర్ హర్ష మల్లేశం, నేతి రవి వర్మ, జికే యువత అధ్యక్షుడు మొగులోజు వెంకట్, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్, బ్యూటీ అసోసియేషన్ బాధ్యులు కూడా హాజరయ్యారు.ప్రజా క్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని ఎలుక ఆంజనేయులు మరియు పాలకవర్గ సభ్యులకు కమలాకర్ సూచించారు.

## ఘనంగా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రజతోత్సవ వేడుకలు



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్**
: జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (వోపా) రజతోత్సవ వేడుకలు 28న ఆదివారం ఎస్బిఎస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం సంస్థ అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. వేడుకల్లో వోపా లోగో, రెండు పాటలు, 2026 క్యాలెండర్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, లాలుకోట వెంకటాచారి, వేములవాడ మదన్మోహన్ ఆచార్యులు, చొల్లేటి కృష్ణమాచారి, వేములవాడ ద్రోణాచారి, ఉప్పుల శ్రీహరి, దుర్శేటి నిరంజనా చారి, దుర్శేటి రవిచందర్ డీఎస్పీతో పాటు విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు, జిల్లాల వారీగా వోపా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.వక్తలు మాట్లాడుతూ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వోపా సేవలను కొనియాడారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వోపా సామాజిక సేవ చేస్తూ ప్రజల మన్ననలను పొందుతోందని, కమ్యూనిటీ భవనం అభివృద్ధికి తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. 25 ఏళ్ల ప్రయాణం గొప్ప విషయమని అభినందించారు.

## ట్రినిటీ కాలేజీలో విజయవంతంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్




**పెద్దపల్లి, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ట్రినిటీ డిగ్రీ & పీజీ కాలేజీలో ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఘనంగా నిర్వహించారు. క్వెస్ కార్ప్, భారత్ బయోటెక్, ఆదర్శ ఆటోమోటివ్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఐ ప్రాసెస్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 80 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలు పొందారు.ఈ సందర్భంగా ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డా. దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, నైపుణ్యాలతో వారిని తీర్చిదిద్దడంలో ట్రినిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. నీతా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎం. రాంచందర్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణిలో సర్పంచ్‌గా పోటీ చేశానని ఉద్యోగం తీసేసారా అని వినతిపత్రం సమర్పించారు



**పెద్దపల్లి, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బసంత్ నగర్‌కు చెందిన తువ్వ సతీష్ యాదవ్, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేస్తూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేశారు. దీనిని కారణంగా చూపుతూ కంపెనీ షోకాజ్ నోటీసు జారీ చేసి ఉద్యోగం నుంచి తొలగించిందని ఆయన ఆరోపించారు.ఈ విషయంపై పెద్దపల్లి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం సమర్పించారు. సింగరేణి వంటి సంస్థల్లో ఇలాంటి నిబంధనలు లేవని, ప్రైవేట్ సంస్థ అయిన అల్ట్రాటెక్ ఉద్దేశపూర్వకంగానే తనపై చర్యలు తీసుకుందని సతీష్ తెలిపారు.గతంలో ఇదే కంపెనీలో పనిచేసిన పాలకుర్తి గ్రామానికి చెందిన దుర్గం జగన్, రావుల నారాయణ, ఆసం లింగయ్య, తక్కలపల్లి గ్రామానికి చెందిన అప్పసూ బక్కయ తదితరులు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన తర్వాత తిరిగి విధుల్లో చేరి పనిచేశారని గుర్తుచేశారు.తన ఉద్యోగాన్ని తిరిగి ఇవ్వాలని, కుటుంబానికి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌ను తువ్వ సతీష్ కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచన



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా నగరపాలక కమిషనర్ ప్రపుల్ దేశాయ్, డిఆర్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు తదితర అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కొన్ని వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు.మొత్తం 379 దరఖాస్తులు అందగా, వీటిలో కరీంనగర్ నగరపాలికకు 74, హౌసింగ్ శాఖకు 67 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై బైండోవర్ చర్యలు



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి, మరల చట్టవ్యతిరేక పనులు చేయకుండా ఉండాలని కరీంనగర్ రూరల్ ఏం ఆర్ ఓ ముందు ప్రవేశపెట్టి లక్ష రూపాయల పూచీకతుపై బైండోవర్ చేశారు.సుదగోని భరద్వాజ్, పోగుల సాయిచంద్, గాలిపెల్లి రాకేష్, కుమ్మరి రాకేష్‌లపై ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇకపై అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై పిడి యాక్ట్ కూడా నమోదు చేస్తామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## ప్రజావాణిలో ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: రెండవ డివిజన్ తీగల గుట్టపల్లి కాంగ్రెస్ నేత కొలగాని అనిల్, మాజీ బిజెపి కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్‌పై మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఎంజైరేగ్స్ నిధుల నుండి నగునూరు గ్రామ అభివృద్ధి కోసం మంజూరైన రూ.50 లక్షలను ప్రజల సౌకర్యార్థం వినియోగించకుండా, తన స్వంత ఫామ్ హౌజ్ మరియు వ్యవసాయ భూముల కోసం సి.సి. రోడ్డు, డ్రైనేజి నిర్మాణానికి వాడుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, నిధులను దుర్వినియోగం చేసిన మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌తో పాటు సహకరించిన వారిపై, రోడ్డు వేసిన కాంట్రాక్టర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన ఫిర్యాదు లేఖలో పేర్కొన్నారు.అనిల్ ఈ సందర్భంగా సంబంధిత ఎంబి రికార్డులను కూడా ఆధారాలుగా సమర్పించారు.

## ఏకగ్రీవంగా పూర్తయిన వార్డు మెంబర్ల ఫోరం కమిటీ ఎన్నిక



**గంగాధర, డిసెంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల వార్డు మెంబర్ల ఫోరం కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో మేడి సుమన్ అధ్యక్షుడిగా, సముద్రాల రామకృష్ణ, పిట్టల మనోహర్, ముద్దం రమేష్, దూలం కృష్ణ గౌడ్, దేశెట్టి రాజు ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా గుంటుకు లత మహేందర్, ఇరుగు రాళ్ల మహేష్, కోశాధికారిగా పిట్టల రాజేందర్ బాధ్యతలు స్వీకరించారు.సహాయ కార్యదర్శులుగా దాసరి ఆంజనేయులు, కాసారపు శ్రీకాంత్, కోలుకాని శంకర్, మల్యాల అనిల్ ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా గుండు మల్లేశం, చిలుమల్ల మహేష్, మాచర్ల లచ్చయ్య, శెట్టిపల్లి పోశెట్టి, విముజాల అశోక్, జిట్టివేని ప్రవీణ్ ఎంపికయ్యారు.గౌరవ అధ్యక్షులుగా వేములవాడ స్వర్ణ లక్ష్మణ చారి, గరిగంటి వెంకన్న బక్కవ్వ, చిలువేరి గంగయ్య, బెజ్జంకిరణ్, గడ్డం నరసయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.ఈ ఎన్నికలతో గంగాధర మండల వార్డు మెంబర్ల ఫోరం కొత్త కమిటీ బాధ్యతలు చేపట్టింది.

# కార్మికులు సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలి



**పెద్దపల్లి, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్**

భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం లేబర్ అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కరీంనగర్ కోల ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్మికుల హక్కులు, సౌకర్యాలు, భద్రత కోసం అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవడం అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో లేబర్ అధికారి రఫీ, మనోజ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి, బైరి శంకర్, కుంభం లక్ష్మీనారాయణ, ఇటిక్యాల సుధాకర్, మిట్టపల్లి సతీష్, గడ్డం శంకర్, వెంగళ రాములు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్ ఠాకూర్ కృషితో రైతులకు రెండు పంటలకు నీటి సౌకర్యం



**అంతర్గాం, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ కృషితో ప్రస్తుతం రెండు పంటలకు సాగునీరు అందుతున్నందుకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎక్లాస్పూర్ గ్రామంలో పొలాల్లో నాట్లు వేసే కూలీలను ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ సోమవారం కలుసుకున్నారు. కూలీలతో ఆత్మీయంగా మాట్లాడి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగు పరిస్థితులు, పంటల వివరాలు తెలుసుకున్నారు.గత బీఆర్ఎస్ పాలనలో ఒక్క పంటకే నీరు రావడం కష్టంగా ఉండేదని, ఇప్పుడు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కృషితో రెండు పంటలకు సమృద్ధిగా నీరు అందుతుందని రైతులు తెలిపారు. సాగునీటి సదుపాయాలు మెరుగుపడటంతో వ్యవసాయ ఉత్పత్తి పెరిగిందని, జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని రైతులు పేర్కొంటూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచన



**మంచిర్యాల, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వినతులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరించారు. మరణ ధ్రువీకరణ పత్రాలు, భూమి నిషేధిత జాబితా తొలగింపు, హద్దుల సమస్యలు, కుటుంబ కలహాలు, పింఛన్ మంజూరు వంటి అంశాలపై మొత్తం 132 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాధవ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా జెల్ల యాదయ్య గౌడ్

**ఎల్.బి.నగర్ డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మాధవ నగర్ కాలనీ కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క సమావేశంలో కార్యవర్గ సభ్యులు అందరూ మాధవ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులుగా జెల్ల యాదయ్య గౌడ్ గారిని ఎన్నుకోవడం జరిగింది. వారిని కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ శాలువాతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలియజేసినారు.

# ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో చేరి విజేతలుగా నిలవాలని కలెక్టర్ సూచన




**సిద్దిపేట, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో చేరి విద్యావంతులై విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాసంస్థల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను కామన్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలు, ఎస్సీ-ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 తరగతుల ఖాళీలు, గౌలిదొడ్డి, అలుగునూరు సీఈఓలో 9వ తరగతి, ఖమ్మం, పరిగి ఎస్ఈఓలో 8వ తరగతి, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. దరఖాస్తుల చివరి తేదీ జనవరి 21 కాగా, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 22న జరుగుతుందని పేర్కొన్నారు. అవసరమైన సర్టిఫికెట్ల సత్వర జారీ కోసం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి .సమీకృత జిల్లా కార్యాలయంలో జరిగిన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ, జిల్లాలో యువతకు ఉపాధి కల్పించడానికి పరిశ్రమల స్థాపన కీలకమని అన్నారు. టీజీ-ఐపాస్‌లో దరఖాస్తు చేసిన పరిశ్రమలను సంబంధిత శాఖలు వెరిఫై చేసి, యూనిట్ స్థాపనకు సుముఖంగా లేని వాటిని డిలీట్ చేయాలని సూచించారు.అన్ని పరిశ్రమల్లో కార్మికులకు ఇన్స్యూరెన్స్ తప్పనిసరిగా చేయాలని, ఎక్కువ మంది కూలీలు పనిచేసే పరిశ్రమల్లో సేఫ్టీ మెథడ్స్ కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్ రామ్, ఎల్డిఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# రామలింగేశ్వర స్వామి దర్శనం చేసిన జిల్లా బిజెపి అధ్యక్షుడు



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట్ మండలం గజసింగవరం గ్రామంలోని రామలింగేశ్వర స్వామిని జిల్లా బిజెపి అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి దర్శించుకున్నారు. ఆలయంలో తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోడె రమేశ్, జిల్లా ప్రతినిధి దేవసాని కృష్ణ, ముస్తఫా నగర్ సర్పంచ్ బండ దేవయ్య, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు వాజిత్ హుస్సేన్, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, ఎల్లారెడ్డిపేట మండల ప్రధాన కార్యదర్శి నంది నరేష్‌తో పాటు పలువురు నాయకులు, బిజెపి కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# యూరియా కొరత లేదని కలెక్టర్ పమేలా సత్పతి భరోసా



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 4246 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఇప్పటివరకు 22,368 మెట్రిక్ టన్నులు సప్లై చేసినట్లు చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి సేల్ కౌంటర్ వద్ద త్రాగునీరు, షామియానా వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలని సూచించారు.మొక్కజొన్న సాగుకు ప్రస్తుత నిల్వలు సరిపోతాయని, అవసరాన్ని బట్టి మరిన్ని సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతాయని కలెక్టర్ భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని, అవసరానికి మించి కొనుగోలు చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు.

# ప్రజావాణి కార్యక్రమంలో కోతుల సమస్యను నియంత్రించాలని వినతి పత్రం సమర్పించారు



**జగిత్యాల, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జగిత్యాలలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 9వ వార్డులో కోతుల సమస్యను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ వినతిని బిజెపి పట్టణ కార్యదర్శి, 9వ వార్డు నాయకురాలు గడ్డల లక్ష్మిహరి కృష్ణ సమర్పించారు. కోతుల వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సూచనలు



**సిద్దిపేట, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రజల వినతులను స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని, అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.జిల్లాలో మొత్తం 132 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, ఏఓ రాజ్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఏఎన్ఎం, ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి విజ్ఞప్తి



**పెద్దపల్లి, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

అర్హతకు మించి వైద్యం చేసి తన భర్త తీవ్ర అనారోగ్యానికి గురయ్యేలా చేసిన ఏఎన్ఎం, ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణి కార్యక్రమంలో నీలారపు రజిత వినతిపత్రం సమర్పించారు.చందపల్లి గ్రామానికి చెందిన నీలారపు సతీష్ డిసెంబర్ 7న ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. చికిత్స కోసం పిలిచిన ఆర్ఎంపి వైద్యుడు తన భార్య ఏఎన్ఎం శిరీషతో కలిసి వచ్చి ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే సతీష్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడని రజిత తెలిపారు. అనంతరం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి మూడు రోజులపాటు చికిత్స చేసి రూ. 1.40 లక్షల బిల్లు వసూలు చేసి ఇంటికి పంపించారని చెప్పారు.ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన తర్వాత సతీష్ పక్షవాత ధోరణితో చెయ్యి, కాలు పనిచేయకుండా పోయిందని రజిత ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులతో కలిసి ఆర్ఎంపి వైద్యుడిని నిలదీయగా, తిరిగి తనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి బెదిరింపులకు గురి చేశాడని వాపోయారు. తన భర్త అనారోగ్యానికి కారణమైన ఏఎన్ఎం శిరీష, ఆర్ఎంపి సతీష్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యశాఖ అధికారులకు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు రజిత తెలిపారు. న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
మంగళవారం 30 డిసెంబర్ 2025

## నిజామాబాద్ కళాభారతి పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు



**నిజామాబాద్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిజామాబాద్ నగరంలో నిర్మాణంలో ఉన్న కళాభారతి పనులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ శీతాకాల సమావేశాల్లో జీరో అవర్‌లో మాట్లాడిన ఆయన, నిజామాబాద్ జిల్లా కళలు, కళాకారులు, సాహిత్యానికి పుట్టినిల్లు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రూ.116 కోట్లతో కళాభారతి నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు కేవలం రూ.50 కోట్లే విడుదల కావడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంట్రాక్టర్‌కు బకాయిలు పెండింగ్‌లో ఉండటం, అంచనాలు మారడం వల్ల రూ.70 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉందని వివరించారు. అద్భుతమైన నిర్మాణంగా రూపుదిద్దుకుంటున్న కళాభవన్ పూర్తయితే జిల్లా కళాకారులకు, సాంస్కృతిక కార్యక్రమాలకు శాశ్వత వేదికగా నిలుస్తుందని అన్నారు. మిగిలిన నిధులను వెంటనే మంజూరు చేసి నిజామాబాద్ నగరానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

## ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌కు అభినందన వెలువ



**కరీంనగర్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్ హిమాయత్‌నగర్ సరిగమ మ్యూజిక్ స్టూడియో ఆడిటోరియంలో నీరజ ఓరుగల్లు స్వరాల జల్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరీంనగర్‌కు చెందిన ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, సామాజిక సేవకుడు, కవి రచయిత, లఘు చిత్రాల దర్శకుడు, నిర్మాత, నటుడు పసుల రవికుమార్‌కు ప్రత్యేక సన్మానం జరిగింది. సినిమా నటుడు పృథ్వీరాజ్, గేయరచయితలు, గాయకులు, సంగీత దర్శకులు పాల్గొని రవికుమార్‌ను అభినందించారు. ప్రముఖుల చేతుల మీదుగా ఆయనకు కవి రచయిత అవార్డు బహుకరించారు. ఈ సందర్భంగా గేయరచయిత ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ, పసుల క్రియేషన్ యూట్యూబ్ ఛానల్ ద్వారా రవికుమార్ రూపొందించే ప్రతి లఘు చిత్రం సామాజిక ప్రయోజనకరమైన ఇతివృత్తంతో ఉంటుందని అన్నారు. రవికుమార్ మాట్లాడుతూ యూట్యూబ్ వినోదాన్ని మాత్రమే కాకుండా సామాజిక చైతన్యాన్ని కలిగించే వేదికగా నిలుస్తుందని, సందేశాత్మకమైన లఘు చిత్రాలు తీయడంలో తాను తృప్తి పొందుతున్నానని తెలిపారు. తన చిత్రాల ద్వారా ప్రజలు మంచిని నేర్చుకోవాలని కోరారు.

## ఎక్సైజ్ శాఖ ప్రతిష్టను పెంచేలా పనిచేయాలని మంత్రి జూపల్లి సూచన



**హైదరాబాద్, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అబ్కారీ శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఏఈఎస్ స్థాయి నుంచి అడిషనల్ కమిషనర్ స్థాయి వరకు మొత్తం 53 మంది అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, పదోన్నతులు పొందిన అధికారులు మరింత ఉత్సాహంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కల్తీ, అక్రమ మద్యం, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా కేసులను దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి గంజాయి, కల్తీ కల్లు తయారీ, అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని, ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ దిశగా ఎక్సైజ్ శాఖ నిరంతరం చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మంత్రి జూపల్లిని కలిసిన వారిలో అడిషనల్ కమిషనర్లు ఎస్.వై. ఖురేషి, సురేష్ రాథోడ్, డిప్యూటీ కమిషనర్లు జె. హరికిషన్, చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్లు డి. శ్రీనివాస్, ప్రదీప్‌రావు, జ్యోతికిరణ్, పంచాక్షరి, ఆర్. కిషన్‌తో పాటు ఈఎస్‌లు ఏ. కిషన్, తుక్యా నాయక్, జీవన్ కిరణ్ తదితరులు ఉన్నారు.

# ధర్మన్న బాటలో పయనిద్దాం




**మహబూబాబాద్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొండపల్లి గోపాల్‌రావు నగర్ కాలనీలోని ధర్మన్న స్తూపం వద్ద అమరజీవి బి. ధర్మన్న 25వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. సభకు ముందు నేతలు, శ్రేణులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారధి మాట్లాడుతూ ధర్మన్న సేవలు మరువలేనివని, ఆయన చేసిన ఉద్యమాలు అమోఘమని కొనియాడారు. భూ పోరాటాలు, దొర పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచిన మహనీయుడు ధర్మన్న అని వివరించారు. 1994లో సిపిఐ ఎమ్మెల్యే విజయంలో, 1995లో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ విజయానికి ధర్మన్న కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రజలపై కేసులు పెట్టి భయపెట్టిన సందర్భాల్లో ధర్మన్నే అండగా నిలిచారని, హాకీ క్రీడాకారుడిగా ఈ ప్రాంతంలో క్రీడలకు ప్రోత్సాహం ఇచ్చారని స్మరించారు. పోలీసులు, ప్రభుత్వాలు ఎన్నో ఇబ్బందులు కలిగించినా ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని ఆయనను కొనియాడారు. ధర్మన్న స్ఫూర్తి 25 ఏళ్లుగా ప్రజల మధ్యలో నిలిచిందని, ఆయన పోరాట మార్గంలో కమ్యూనిస్టులంతా పయనిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అదే సందర్భంలో భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాలు జనవరి 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో ఐదు లక్షల శ్రేణులతో జరుగుతాయని, ఈ ప్రాంతం నుంచి వేలాదిగా కదిలి వెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో అధిక సీట్లు గెలిచి ప్రజలకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి. అజయ్ సారధి రెడ్డి, ధర్మన్న సతీమణి బి. నీరజారెడ్డి, కుమారుడు ఎన్నారై బి. రంజిత్ రెడ్డి, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, కట్లోజు పాండురంగాచారి, వరిపల్లి వెంకన్న, తండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, బానోత్ లింగ్య నాయక్, కేదాసు రమేష్, అజ్మీర వేణు, ఎండి మహమూద్, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, కొమ్ము నారాయణ, కూరాకుల పాల్, మంద శంకర్, తండ శ్రీనాథ్, ఎండి రఫీ, చిదిరాల జ్ఞానేశ్వర్, చరిత్ రెడ్డి, ధర్మచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే దీరావత్ రాగ్యనాయక్ కు ఘన నివాళి



**మిర్యాలగూడ, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిర్యాలగూడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే దీరావత్ రాగ్యనాయక్ 24వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, పలు రాజకీయ నాయకులు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. అడవిదేవులపల్లి నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ కూరాకుల చినరామయ్య, భారతీ రాగ్యనాయక్, స్కైలాబ్ నాయక్, ఎర్రబోతు సాంబశివరావు, గోపగాని హనుమంతు, పొదిల వెంకన్న, భూపతి కేశవయ్య, ఉల్లెందుల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాగ్యనాయక్ ప్రజాసేవా తపనను, ఆయన రాజకీయ జీవన ప్రయాణాన్ని స్మరించుకుంటూ నాయకులు ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ప్రజల కోసం చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని, ఆయన స్ఫూర్తి తమకు మార్గదర్శకమని పలువురు పేర్కొన్నారు.

## బ్రాహ్మణులకు అప కర్మలకు స్థలం కేటాయించాలి



**నల్లగొండ,డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బ్రాహ్మణులకు ముఖ్యమైన అపర కర్మలకు స్థలం కేటాయించాలని అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. పట్టణంలో కిరాయి ఇండ్లలో ఉంటూ కాలం చేసే బ్రాహ్మణులకు అపరకర్మ లు చేయుటకు, దహన సంస్కారాలు నిర్వహించే విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని, హైందవ సంస్కృతి సాంప్రదాయాన్ని కాపాడే బ్రాహ్మణులకు ధూప ,దీప నైవేద్యం పథకంలో ప్రాధాన్యత పెంచాలని వృత్తిని కొనసాగించడానికి జీవనోపాధి కల్పించడానికి దోహదపడే విధంగా ఎండోమెంట్ ద్వారా రిక్రూట్ అయిన ధూప దీప నైవేద్య పథకంలో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. మైనార్టీల మాదిరిగానే ప్రభుత్వం సహకరించి అపరకర్మాలకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు, గౌరవ అధ్యక్షుడు దోమల పెల్లి శశిధర్, గౌరవ సలహాదారుడు పులిజాల యాదగిరి రావు, భాస్కర్, రాయిని నవీన్ శర్మ, ఫణి ఆచార్య తదితరులు పాల్గొన్నారు

## చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా జైలు తప్పదు

-మహబూబాబాద్ జిల్లా ఎస్పీ హెచ్చరిక




**మహబూబాబాద్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా పరిధిలో నిషేధిత చైనా మాంజా విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా. శబరీష్ స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో గాలిపటాల ఎగరవేతకు యువత సిద్ధమవుతుండగా, ప్రమాదకరమైన చైనా మాంజా వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చైనా మాంజా అనేది సింథటిక్ దారం, గాజు పొడి కలిపిన దారం. దీని వినియోగం వల్ల పక్షుల మెడలు, రెక్కలు కోసుకుపోవడం, ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడటం, ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని ఎస్పీ వివరించారు. ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పుగా మారిన ఈ మాంజాను ఎవరైనా విక్రయించినా లేదా వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చైనా మాంజా విక్రయం లేదా వినియోగంలో పాల్గొన్నవారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని, ఇది చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. నిషేధిత మాంజా నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు చైనా మాంజాను పూర్తిగా నివారించి, ప్రభుత్వ అనుమతితో ఉన్న కాటన్ దారాలతో మాత్రమే గాలిపటాలు ఎగరవేయాలని సూచించారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

## రైతుల సౌకర్యార్థం యూరియా యాప్




**మహబూబాబాద్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ ను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి ప్రతి రైతుకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల తెలిపారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచనల మేరకు సోమవారం నుండి యాప్ అమలులోకి వస్తుందని ఆమె వివరించారు. భూమిలో సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు తమ మొబైల్ ఫోన్ నెంబర్ లేదా ఆధార్ ద్వారా లాగిన్ అయి పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువుల డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న యూరియా స్టాక్ వివరాలు ఈ యాప్ లో ప్రత్యక్షంగా కనిపిస్తాయని, రైతులు యాప్ ద్వారా సులభంగా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది రైతులకు యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కల్పించి, బుకింగ్ విధానం నేర్పించాలని ఆమె ఆదేశించారు. సోమవారం జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, రైతులు ప్రత్యక్షంగా యాప్ వినియోగాన్ని నేర్చుకున్నారు. ఈ యాప్ ద్వారా రైతులకు ఎరువుల లభ్యతపై స్పష్టమైన సమాచారం అందడంతో పాటు, పారదర్శకత పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణలో విషాదం

**మహబూబాబాద్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

చిన్నతనం నుంచి కలిసి పెరిగారు. కలిసి చదువుకున్నారు. కలలతో విదేశాలకు వెళ్లారు. అక్కడి యూనివర్సిటీ లో కలిసి చదువుకున్నారు. కానీ విధి వక్రబాణం వారిని విడదీయలేదు. కారు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరణంలోనూ వారి బంధం వీడలేదు.అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రానికి చెందిన పుల్లఖండం మేఘనా రాణి (25), గార్ల మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన కడియాల భావన (24) మూడు సంవత్సరాల క్రితం అమెరికా వెళ్లి కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ డాటన్ లో ఎం.ఎస్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు.మిత్రులందరూ కలిసి విహారయాత్రకు బయలుదేరిన సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. క్యాలిఫోర్నియా నుంచి రెండు కార్లలో ఎనిమిది మంది విద్యార్థులు ప్రయాణిస్తుండగా, అలభామా హిల్స్ మూల మలుపు వద్ద వెనుక వెళ్తున్న కారు లోయలో పడిపోయింది. ఆదివారం సాయంత్రం నాలుగు





గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో మేఘనా, భావన అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మేఘనా తండ్రి మీసేవ నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా, భావన తండ్రి ముల్కనూరు గ్రామంలో ఉప సర్పంచ్ గా ఉన్నారు. ఈ రెండు కుటుంబాలను స్థానిక సి.పి.ఎం నేతలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత పరామర్శించారు. మృతదేహాలను భారత్ తీసుకురావడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని వారికి భరోసా ఇచ్చారు.విదేశాల్లో కలలతో అడుగులు వేసిన ఈ ఇద్దరు యువతుల మరణం తెలంగాణలోని వారి గ్రామాలను కన్నీటి మడుగులో ముంచేసింది.

# కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు బియ్యం ,నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ




**నల్లగొండ, డిసెంబర్ 29, (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ లో గల శాంతి నగర్ లెప్రసీ కాలనీ, లెప్రోసి హెల్త్ సెంటర్, మరియు అంబేద్కర్ లేప్రోసి కాలనీలలో కుష్టి వ్యాధిగ్రస్తులకు క్రిస్మస్ మరియు నూతన సంవత్సరం సందర్భంగా గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం వారు 280 కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు మరియు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్గొండ డీఎస్పీ శివరామిరెడ్డి గారు పాల్గొనీ వారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ గారు మాట్లాడుతూ గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ వారు చేస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు. సంస్థ వారు గత 28 సంవత్సరాలు నుండి కుష్టి వ్యాధిగ్రస్తులకు అనేక రకాలుగా మెడికల్ క్యాంపులు, బియ్యం, భోజనం, బట్టలు మరియు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నట్టు తెలియజేసినారు. ఈ నూతన సంవత్సరంలో 2300 కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు బియ్యం నూతన వస్త్రాలు మరియు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి గారు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి గారు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ గారు, బచ్చల సౌర్య, క్రిస్టఫర్ ,అంబికా సిస్టర్, ఎర్నెస్ట్ పాల్, సంస్థ సిబ్బంది జాన్, రమేష్, రాము, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే మేఘారెడ్డి లక్ష్యం

-అసెంబ్లీలో వనపర్తి నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావన
-శీతాకాల సమావేశాల్లో కీలక అంశాలు లేవనెత్తిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశంలో వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రస్తావించారు. రెవెన్యూ, దేవాదాయ, అటవీ, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.వనపర్తి మండలం నాగవరం, రాజనగరం గ్రామ శివారుల్లోని కొన్ని రెవెన్యూ భూములు పొరపాటున దేవాదాయ భూములుగా నమోదు కావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్త సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వనపర్తి బైపాస్ రోడ్డు నిర్మాణం కూడా ఇదే



శాఖల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా నిలిచిపోయిందని, వెంటనే స్పష్టత తీసుకువచ్చి పనులు ప్రారంభించాలని కోరారు.ఖాన్ చెరువు నిర్మాణానికి సంబంధించిన 600 మీటర్ల కాలువ పనులు అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిపోయాయని, ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేయించి పనులు పూర్తిచేయాలని సూచించారు.ఆముదాలబండ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పంచాయతీరాజ్ శాఖ రోడ్ల నిర్మాణం, రిన్యూవల్ సమస్యలపై కూడా సభ దృష్టికి తీసుకువచ్చారు.పెబ్బేరు మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, పెబ్బేరు సంతకు సంబంధించిన ఫైళ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, వాటిపై త్వరిత నిర్ణయం తీసుకోవాలని కోరారు.వనపర్తి పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పట్టణానికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.గొల్లపల్లి రిజర్వాయర్, బుద్ధారం స్టేజ్ -2 రిజర్వాయర్, ఖిల్లా ఘనపురం గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణాల కోసం భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఏ సమావేశమైనా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్లడమే తన ధ్యేయమని మేఘారెడ్డి స్పష్టంచేశారు.

# ఘనంగా ఇరుముడి మహోత్సవం

-శరణుగోషతో శబరి బయలుదేరిన స్వాములు



**వనపర్తి డిసెంబర్ 29( నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్ ):**
అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి ధరించిన స్వాములు ఈరోజు శబరిమల యాత్రకు బయలుదేరినారని గురుస్వామి నందిమల్ల అశోక్ తెలిపారు. ముత్తు కృష్ణ గురుస్వామి ఆధ్వర్యములో గణపతి హోమం,స్వామి వారికి అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం గురుస్వామి ముత్తు కృష్ణ వాకిటి శ్రీధర్, నందిమల్ల. అశోక్,ఆవుల రమేష్ బృందానికి ఇరుముడులు కట్టి ఆశీర్వదించారు. బి.ఆర్.ఎస్ నాయకులు గట్టు యాదవ్,పలుస.రమేష్ గౌడ్,రంగాపురం.కృష్ణారెడ్డి,మాజీ కౌన్సిలర్స్ బండారు.కృష్ణ,ఉంగ్లం. తిరుమల్ ,కంచె.రవి,ప్రేమ్ నాథ్ రెడ్డి,డాక్టర్.డ్యానియల్ తదితరులు స్వాములకు కృత్షతలు తెలిపారు.

# సమిష్టి కృషితో గ్రామాభివృద్ధి



**ఎలిగేడు, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని రాకలదేవుపల్లి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో వార్డు సభ్యులు, అధికారులు సమిష్టి కృషి ద్వారా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తోడ్పాటు అందించాలని సర్పంచి మద్దెల రమాదేవి-సంపత్ పేర్కొన్నారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నూతన పాలకవర్గం తొలి గ్రామసభ నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతామని తెలిపారు.గ్రామసభలో పారిశుధ్యం, వీధిలైట్లు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడం, మహిళా స్వశక్తి భవన నిర్మాణం, అంతర్గత రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలతో పాటు నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టేందుకు తీర్మానం చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడిగె శివకృష్ణ గౌడ్, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంధ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైకుంఠ వాహనం అందజేస్తామని హామీ ఇచ్చిన ఎర్రోళ్ల రాఘవేందర్



**కడ్తాల్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కడ్తాల్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ప్రజలకు అందరికి ఉపయోగపడే విధంగా అంతిమ యాత్ర వైకుంఠ వాహనం అందజేస్తానని తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు, జాతీయ బి సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కడ్తాల్ గ్రామపంచాయతీ 4వ వార్డు సభ్యుడు ఎర్రోళ్ల రాఘవేందర్ హామీ ఇచ్చారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వివరించారు. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా వైకుంఠ వాహనం ఏర్పాటు చేయడం ద్వారా గ్రామస్థులకు సౌకర్యం కల్పించడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కడ్తాల్ గ్రామపంచాయతీ కార్యదర్శి అల్లాజీ, గ్రామ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉపసర్పంచ్ ఈరెడ్డి యాదగిరి రెడ్డి, వార్డు సభ్యులు పెరమళ్ళ లక్ష్మమ్మ, నూర్జన బేగం, కర్రోళ్ల కృష్ణ వేణి, చేగురి మమత, బాను కిరణ్, కొప్పు వసంత, దుద్దు పూలమ్మ, మాదారం గణేష్ గౌడ్, మంకి మహేష్, ముత్తి కృష్ణ, విజయ్ రాథోడ్ నాయక్, వాకుడావత్ రవి నాయక్‌తో పాటు గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని ప్రజావాణిలో వినతి



**ఉప్పునుంతల, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉప్పునుంతల మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామ సమీపంలోని దుందుభి వాగు నుంచి విచ్చలవిడిగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గ్రామస్థులు తమ సమస్యను వివరించారు. రాత్రి పగలు తేడా లేకుండా యంత్రాల సహాయంతో ఇసుకను తరలిస్తున్నారని, ఈ అక్రమ రవాణా వల్ల గ్రామ పరిసరాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఇసుక మాఫియాను నియంత్రించేందుకు నిఘా యంత్రాంగం ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వినతిలో పేర్కొన్నారు.గ్రామస్తుల ఈ విజ్ఞప్తి ప్రజావాణి వేదికపై ప్రతిధ్వనించింది. సమస్య పరిష్కారానికి జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గంగవరం కి ఘన సత్కారం

-కళావేదికలు వనపర్తికి ఆస్తులు
- రావుల చంద్రశేఖర్ రెడ్డి



**వనపర్తి,డిసెంబర్ 29( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రచయిత గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన ఖాళీ కుర్చీ,పిట్ట కొంచెం కూత గనం ఉన్నట్టుగా చిన్నగా ఉన్నందుకు పుస్తకాన్ని పూర్తిగా చదివినట్లు రావుల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి తనను ఆహ్వానించినప్పటికీ, వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేకపోయానని అన్నారు.సాహిత్యం అంటే తనకు ఎంతో ఆసక్తి ఉందని, ముఖ్యంగా వచన కవిత్వం తనకు ఇష్టమని చెప్పారు. సాహితీ కళావేదికలు వనపర్తి జిల్లాకు ఆస్తులని వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా గంగవరం రామకృష్ణారెడ్డి నుంచి ఖాళీ కుర్చీ పుస్తకాన్ని స్వీకరించిన రావులను, రామకృష్ణారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ముందు ముందు ఇంకా మంచి పుస్తకాలతో సాహిత్యానికి సేవలందిస్తూ ఆయురారోగ్యాలతో జీవించాలని రావులు ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, ఉపాధ్యాయుడు బైరోజు చంద్రశేఖర్, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు మధు గౌడ్, బాలస్వామి, బండారు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరుదైన గౌరవం



**ఎలిగేడు, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: స్వచ్ ఎవం హరిత విద్యాలయ రేటింగ్ 2025-26లో జిల్లాస్థాయిలో ఎంపికై రాష్ట్ర స్థాయికి నామినేట్ కావడం ద్వారా ఎలిగేడు మండల పరిధిలోని సుల్తానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరో విశిష్ట గుర్తింపును అందుకుంది.పాఠశాలలోని మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యా ప్రమాణాల మెరుగుదలలో ఉపాధ్యాయుల కృషి ప్రత్యేకంగా గుర్తించబడింది. విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, పాఠశాల పరిసరాల పరిశుభ్రత ఈ పురస్కారానికి కారణమయ్యాయి.సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రచారీ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమిష్టి కృషి, గ్రామస్తుల సహకారం వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందని హర్షం వ్యక్తం చేశారు.ఈ విజయాన్ని సుల్తానాపూర్ గ్రామ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, ఉపసర్పంచ్ తానిపర్తి రమేష్ రావు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, మాజీ సర్పంచ్ అర్షణపల్లి వెంకటేశ్వరరావు, గ్రామ సెక్రటరీ శివతో పాటు గ్రామస్తులు అభినందించారు.ఈ గుర్తింపు పాఠశాల ప్రతిష్టను మరింతగా పెంచడమే కాకుండా, విద్యా రంగంలో పరిశుభ్రత, క్రమశిక్షణ, నాణ్యతకు కొత్త ప్రమాణాలను నిలబెట్టింది.

## నర్సాపూర్ లో గ్రామం పంచాయతీ తొలి గ్రామ సభ

**ఎలిగేడు, డిసెంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మండల పరిధిలో ఉన్న నరసాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం తొలి గ్రామ సభను సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు , ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో పెండింగ్ సమస్యలు, డ్రైనేజ్ వంటి సమస్యలను ,తాగునీరు , పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలను




అందిస్తామని.ఉపాధిహామీ పథకం గ్రామాభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన పనుల ప్రణాళిక పై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ లలిత, ఉపసర్పంచ్ గోసిక రవి, వార్డు సభ్యులు కాంపెల్లి లక్ష్మి, పల్లెర్ల పద్మ, మ్యాధరవేణి శ్రీనివాస్, తంగెళ్ళ సతీష్, తుడి నీరోష, రాసూరి తిరుపతి, కాంపెల్లి సుస్మిత ఆశ వర్కర్లు ,అంగన్వాడీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్,మహిళా సంఘాల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పౌరహక్కుల దినోత్సవం

**ఎలిగేడు, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి గ్రామంలో నేడు ఉదయం 10.30 గంటలకు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ యాకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పౌరహక్కుల దినోత్సవం ప్రతి ఒక్కరికీ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛల పట్ల అవగాహన కలిగించేందుకు ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గ్రామస్థుల భాగస్వామ్యం ద్వారా పౌరహక్కుల విలువలు మరింత బలపడతాయని, సమాజంలో ప్రతి ఒక్కరి గౌరవం, సమానత్వం, న్యాయం నిలబెట్టే దిశగా ఈ దినోత్సవం చైతన్యాన్ని కలిగిస్తుందని తహసీల్దార్ అభిప్రాయపడ్డారు.నారాయణపల్లి ప్రజలు, యువత, విద్యార్థులు పాల్గొని పౌరహక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# రంగారెడ్డిలో యూరియా కొరత లేదని స్పష్టం చేసిన కలెక్టర్



**రంగారెడ్డి, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: రంగారెడ్డి జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగుతోందని ఆయన తెలిపారు.ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాల్లో అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. విక్రయ కేంద్రాల్లో రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా స్టాక్ వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.యూరియా సరఫరా విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేస్తామని ఆయన తెలిపారు. అలాగే విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా స్టాక్ అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# తానేదారుపల్లి అభివృద్ధికి శ్రీకారం

- సొంత ఖర్చులతో రోడ్డు విస్తరణ చేపట్టిన సర్పంచ్ కంచర్ల యాదమ్మ



**గుర్రంపోడ్, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గుర్రంపోడ్ మండలం తానేదారుపల్లి స్టేజి నుండి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా కంప చెట్లు విస్తారంగా పెరిగి ప్రయాణికులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించేవి. ఈ సమస్యను గుర్తించిన నూతన సర్పంచ్ కంచర్ల యాదమ్మ (కంచర్ల ఈశ్వర్) ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని తన సొంత ఖర్చులతో రోడ్డు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే గ్రామంలోని రైతు వేదిక చుట్టూ ఉన్న కంప చెట్లను కూడా తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దారు. గ్రామంలో రాత్రి సమయంలో భద్రత పెంచేందుకు విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయించారు. దీంతో గ్రామంలోకి వెళ్లే రహదారి విశాలవంతంగా మారి, రాకపోకలకు అనుకూలంగా మారింది. రోడ్డు అభివృద్ధి పనులతో గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ యాదమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్న నూతన సర్పంచ్ తీరును గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్, ఉప సర్పంచ్ పాల్వాయి ఏడుకొండలు, వార్డు మెంబర్ మేడి శివగీతా ప్రశాంత్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు మేడి కొండలు నరసింహ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 50 ఫిర్యాదులు స్వీకరణ



**నాగర్‌కర్నూలు, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యల అర్జీలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్వీకరించారు. అదనపు కలెక్టర్ పి. అమరేందర్, దేవ సహాయం తో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల వినతులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 50 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.అదేవిధంగా సిఎంఓ ప్రజావాణి పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## లస్కర్ గూడ నూతన సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన అల్లే ఐలయ్య...




**అబ్దుల్లాపూర్ మెట్,డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అబ్దుల్లాపూర్మెట్ మండలం, లస్కర్ గూడ గ్రామ నూతన సర్పంచ్ బాధ్యతలు స్వీకరించిన అల్లే ఐలయ్య సోమవారం రోజు బాధ్యతలను స్వీకరించారు. ప్రత్యేక అధికారి ఎంఈఓ జగదీశ్వర్, ఎంపీఓ మధుసూదనా చారి హాజరై నూతన పాలకవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు నాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించినందుకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ప్రజాసేవలో ముందుండి ప్రజల సమస్యలే అజెండాగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కరిమళ రాజు, వార్డ్ సభ్యులు సిద్ధగోని మధుసూదన్, సూర్వి రజిత, గుండె శివ ప్రసాద్, సిద్ధగోని యాదయ్య గౌడ్, గుండె కవిత సుధాకర్, గుండె లక్ష్మమ్మ, మహ్మద్ హుస్సేన్, నల్ల దివ్యజ్యోతి రాజ్ యాదవ్, మహమ్మద్ నజీమా అమీద్, గ్రామపంచాయతీ సెక్రటరీ శివ, గ్రామపంచాయతీ కారోబార్ ఉప్పు రాములు .సిబ్బంది, గ్రామ ప్రజలు, ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 40 అర్జీలు

పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు



**రంగారెడ్డి, డిసెంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 40 ఫిర్యాదులు అందాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ఒక ముఖ్య వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా నిరంతర సమీక్ష నిర్వహిస్తూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 21, ఇతర శాఖలకు 19 అర్జీలు అందగా, మొత్తం 40 దరఖాస్తులు నమోదు అయ్యాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.